క్రీడలకు సమయం కేటాయించాలి



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి సీపీ సింధుశర్మ

ఎడపల్లి, న్యూస్‌టుడే : పోలీసుల విధి నిర్వహణలో క్రీడలు ఎంతో అవసరమని ఇన్‌ఛార్జి సీపీ సింధుశర్మ పేర్కొన్నారు. జానకంపేట శివారులోని పోలీసు శిక్షణ కేంద్రంలో స్టయిఫండరీ కేడెట్ ట్రైనీ కానిస్టేబుళ్లకు స్పోర్ట్స్ మీట్-2024ను సీపీ మంగళవారం ప్రారంభించారు. క్రీడాకారుల నుంచి వందనం స్వీకరించి పరిచయం చేసుకొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఆటల కోసం కొంత సమయం కేటాయించాలని సూచించారు. 250 మందికి క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందిస్తున్నామన్నారు. శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్, అదనపు పోలీసు కమిషనర్ కోటేశ్వరరావు, అదనపు డీసీపీ బస్వారెడ్డి, అధికారులు మస్తాన్‌అలీ, శ్రీనివాస్‌రావు, నాగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయి'

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: పది నెలలు గడిచినా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు దిక్కులేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. భాజపా జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెండు పడక గదుల ఇళ్ల పేరుతో పదేళ్లు భారాస ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, ఐదు డిక్లరేషన్లు, 100 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పటి వరకు అమలు చేయలేదని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు దేవుడెరుగు.. కనీసం కట్టిన వాటినైనా అర్హులకు ఇవ్వాలని కోరారు. ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాటలు పాల మీద పొంగులా ఉన్నాయని ఎద్దేవా చేశారు. రైతు భరోసా ఎప్పుడు వేస్తారా అని అన్నదాతలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డికి నిజామాబాద్ నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ జిల్లా అభివృద్ధిపై లేదన్నారు. నాగోళ్ల లక్ష్మీనారాయణ, స్రవంతిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



ఈ రకాలకే బోనస్..

సన్నాలపై సర్కారు స్పష్టత

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఎన్నికల హామీలో భాగంగా క్వింటా సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించింది. ఏ రకం వంగడాలకు బోనస్ వర్తిస్తుందనే సందేహాలు రైతుల్లో ఉన్నాయి. వాటిని నివృత్తి చేసేందుకు సర్కారు గుర్తించిన సన్న రకం వంగడాలు ఇవే.

కొనుగోలు కేంద్రాల్లో సేకరించే సన్నరకం వంగడాలు

- సాంబ మసూరి (బీపీటీ-5204)
- హెచ్‌ఎంటీ సోనా
- కూనారం వరి (కేఎన్‌ఎం-1638)
- కూనారం వరి-1 (కేఎన్‌ఎం-733)
- జగిత్యాల మసూరి (జేజీఎల్-11470)
- జగిత్యాల వరి-2 (జేజీఎల్-28545)
- జగిత్యాల వరి-3 (జేజీఎల్-27356)
- మానేరు సోనా (జేజీఎల్-3828)
- జగిత్యాల సన్నాలు (జేజీఎల్-1798)
- జగిత్యాల సాంబ (జేజీఎల్-3844)
- జగిత్యాల సాంబ (జేజీఎల్-3855)
- పొలాస ప్రభ (జేజేఎల్-384)
- కరీంనగర్ సాంబ (జేజీఎల్-3855)
- అంజన (జేజీఎల్-11118)
- ప్రత్యుమ్న (జేజీఎల్-17004)
- జేజీఎల్-33124 (పీఆర్ఫ్)
- తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్-15048)
- ఆర్ఎన్ఆర్-31379 (పీఆర్ఫ్)
- కృష్ణ (ఆర్ఎన్ఆర్-2458)
- సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్-2465)
- శోభిని (ఆర్ఎన్ఆర్-2354)
- రాజేంద్రనగర్ వరి-4 (ఆర్ఎన్ఆర్-21278)
- వరంగల్ సాంబ (డబ్ల్యూజీఎల్-14)
- వరంగల్ సన్నాలు (డబ్ల్యూజీఎల్-32100)
- వరంగల్ వరి-1119
- వరంగల్ వరి-2 (డబ్ల్యూజీఎల్-962)
- సోమనాథ్ (డబ్ల్యూజీఎల్-347)
- కేపీఎస్-6251 (పీఆర్ఫ్)
- ఎంటీయూ-1271
- నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్-34449)
- మార్టేరు సాంబ (ఎంటీయూ-1224)
- మార్టేరు మసూరి (ఎంటీయూ-1262)

ఇందూరుకు దోమకాటు

న్యూస్‌టుడే, నిజామాబాద్ వైద్యవిభాగం

- జిల్లాలో డెంగీ కేసులు 602
- జీజీహెచ్‌లో ఒక్కరోజే 2,381 ఓపీ నమోదు


జిల్లా ప్రజలపై ఈ ఏడాది దోమే అత్యధికంగా ప్రభావం చూపింది. డెంగీ సోకిన కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. ఇటు వైద్యానికి డబ్బులు వెచ్చించి రెండు విధాలా నష్టపోయారు. ప్లేట్‌లెట్లు పడిపోవడంతో సగటున ఒక్కో రోగి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేసుకోవాల్సి వచ్చింది. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు వ్యాధి బారిన పడి విలవిలలాడాయి. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, ఎడతెరిపి లేని వర్షాలతో ఎక్కడిక్కడ నీరు చేరి దోమల లార్వాలు వృద్ధి చెందాయి. డెంగీ కారక దోమ ఏడిస్ ఈజిప్టి ప్రతి వీధిలో తిరిగి రోగాలను వ్యాప్తి చేసింది.

వర్షా కాలం ముగుస్తున్నా..

వర్షాకాలం ముగుస్తోంది. ఈ పాటికే సీజనల్ జ్వరాలు తగ్గుముఖం పట్టాలి. కానీ, జిల్లాలో పరిస్థితి భిన్నంగా ఉంది. తరచూ వర్షాలు కురుస్తుండటంతో వ్యాధుల ముప్పు తగ్గడం లేదు. డెంగీ కేసులు మరింత పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సోమవారం ఒక్కరోజే 2381 ఓపీ నమోదైంది. ఏడు నెలల్లో కలిపి 120 కేసులొస్తే.. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరులో 482 డెంగీ కేసులు నమోదు కావడం గమనార్హం. జిల్లా కేంద్రం అర్సపల్లి, మాలపల్లి, దుబ్బ, సీతారాంనగర్, గౌతంనగర్, చంద్రశేఖర్ కాలనీ, వినాయక్‌నగర్ పట్టణారోగ్య కేంద్రాల పరిధిలో 202, ఇందల్‌వాయి పీహెచ్‌సీలో 47, ముదక్‌పల్లిలో 53, మోస్రాలో 29 మంది బాధితులు ఉన్నారు. ప్రైవేటులో ఇంతకంటే ఎక్కువ మందే చికిత్స పొందుతున్నారు.



తేదీల వారీగా జీజీహెచ్‌లో ఓపీ



తప్పుడు లెక్కలు

ఇందల్‌వాయి పీహెచ్‌సీ పరిధిలో గతనెల 19వ తేదీన 81 డెంగీ కేసులు ఉంటే.. ఈ నెల 10న 77 కేసులే ఉన్నట్లు లెక్కలు చూపారు. గౌతంనగర్‌లో పట్టణారోగ్య కేంద్రంలో గతనెలలో 43 ఉంటే ఈ నెల 39 ఉన్నట్లు, మోస్రాలో గతనెల 42 ఉంటే ఈ నెల 29 ఉన్నట్లు చెబుతున్నారు.

ర్యాపిడ్ పరీక్షలు పరిగణించడం లేదు

- తుకారాం రాథోడ్, కీటకజనిత వ్యాధుల నియంత్రణాధికారి

ర్యాపిడ్ టెస్టులో పాజిటివ్ వచ్చిన వాటిలో 30 శాతం తప్పుగా ఉంటున్నాయి. వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. పీహెచ్‌సీల్లో ర్యాపిడ్‌లో డెంగీ ఉన్నట్లు తేలగానే జీజీహెచ్‌కు పంపించి ఎలిజా మెథడ్‌లో పరీక్షలు చేయిస్తున్నాం. ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులూ ఇదే పాటించాలి. తప్పుడు లెక్కల విషయం 'న్యూస్‌టుడే' ఆరా తీయగా ఒకే రోగి పేరు మూడు సార్లు నమోదైందని, హైదరాబాద్ నుంచి వచ్చిన రోగుల పేర్లు తొలగించామని చెప్పారు.

కొత్త గురువులతో కొరత తీరేనా..!

పాఠశాల విద్య గాడిన పెట్టాల్సిన బాధ్యత వారిదే

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

కొన్నేళ్లుగా ఉపాధ్యాయుల కొరత, పర్యవేక్షకుల లేమితో ప్రభుత్వ బడులపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతూ వచ్చింది. పిల్లల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు కొరవడ్డాయి. ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలతో కొత్త సమస్య నెలకొంది. విద్యార్థులున్న చోట ఉపాధ్యాయులు లేకపోవడం,



బోధకులు ఉన్న చోట పిల్లలు లేకపోవడం వంటి ఇబ్బందులు తలెత్తాయి. బదిలీ చేసినప్పటికీ ప్రత్యామ్నాయం లేక రిలీవ్ చేయలేకపోయారు. ప్రస్తుతం డీఎస్సీ నియామక ప్రక్రియతో కొత్త గురువులు కొలువు దీరారు. బదిలీ అయిన వారు తమకు కేటాయించిన బడుల్లో రిపోర్టు చేశారు. ఇప్పుడైనా తమ పిల్లల చదువులు గాడిన పడతాయనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

న్యాస్ ప్రగతిపై దృష్టిసారించాలి

ఇప్పటికే జిల్లాలో జాతీయ సాధన పరీక్ష(న్యాస్)కు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో తీవ్రమైన ఉపాధ్యాయుల కొరత కారణంగా కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించలేకపోతున్నారని గ్రహించారు. ప్రస్తుతం 319మంది నూతన ఎస్జీటీలు బాధ్యతలు చేపట్టారు. వారు న్యాస్ ప్రగతిపై దృష్టి సారించాలి. విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచి, జాతీయస్థాయి సర్వేలో జిల్లాను ఉన్నతంగా నిలపాల్సిన అవసరముంది.

మొత్తం ప్రభుత్వ పాఠశాలలు : 1156
విద్యార్థులు : 1.04 లక్షలు
డీఎస్సీ-2024 లో చూపిన ఖాళీలు : 601
భర్తీ చేసినవి : 462

పది ఫలితాల్లోనూ...

ఉపాధ్యాయ పదోన్నతులతో ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత చాలా వరకు తీరింది. డీఎస్సీలో 143 మంది అన్ని కేటగిరీలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు అదనంగా అందుబాటులోకి వచ్చారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు దాదాపు నాలుగు నెలలు ఉంది. డిసెంబరులోపు సిలబస్ పూర్తి చేసి, పునఃశ్చరణ చేయించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవాలని విద్యానిపుణులు ఆశిస్తున్నారు.

అసంపూర్తిగానే సమస్య..

కొత్త గురువులు వచ్చినా విద్యాశాఖ సూచించిన జీవో నెం.25 ప్రకారమే ఇంకా పూర్తిస్థాయిలో బోధకులు రాలేదని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. వాస్తవానికి జీవో ప్రకారం నియామకాలు పూర్తి చేసినా ఒక్కరిద్దరు ఉపాధ్యాయులతో ఐదు తరగతులు నిర్వహించడం అసాధ్యమని చెబుతున్నారు.

జిల్లాను ఉన్నతంగా నిలపాలి

- దుర్గాప్రసాద్, డీఈవో, నిజామాబాద్

నూతన గురువుల రాకతో క్లిష్టమైన సమస్యలు పరిష్కరించుకున్నాం. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు, సీనియర్ల సలహాలతో విద్యాప్రగతిలో రాష్ట్రంలో జిల్లాను ముందు వరసలో నిలబెట్టాలి.

ఎకరాకు పది క్వింటాళ్ల పరిమితి

సోయా కొనుగోళ్లపై మార్క్‌ఫెడ్ నిర్ణయం



మార్క్‌ఫెడ్ ఛైర్మన్ గంగారెడ్డికి సరకు వివరాలు వెల్లడిస్తున్న సీడబ్ల్యూసీ జిల్లా మేనేజర్ నరేశ్

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మద్దతు ధరతో సేకరిస్తున్న సోయా పంటను ఇక నుంచి ఎకరానికి పది క్వింటాళ్ల వరకు కొనేందుకు అనుమతినిస్తున్నట్లు మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మార గంగారెడ్డి వెల్లడించారు. పెరిగిన దిగుబడుల దృష్ట్యా ఇది వరకు ఉన్న 6 క్వింటాళ్ల పరిమితిని ప్రభుత్వం పెంచిందని ఆయన ప్రకటించారు. అయితే నాణ్యమైన పంటను సేకరించాలని సూచించారు. బోధన్ నుంచి కొనుగోలు చేసిన లారీ సరకును నాఫెడ్ తిప్పి పంపడంతో ఆయన మంగళవారం సారంగపూర్‌లోని సెంట్రల్ వేర్‌హౌస్ కార్పొరేషన్ గోదాములను పరిశీలించారు. కేంద్రం ఇచ్చిన నాణ్యతా ప్రమాణాలకు తగ్గట్లు గింజ లేకపోతే తూకం వేయొద్దని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు చెప్పారు. ముందే పంట పరిశీలించి సేకరించాలన్నారు. గోదాముల్లో నిల్వ ఉన్న సరకు పరిస్థితిని సీడబ్ల్యూసీ మేనేజర్ నరేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. సేకరించిన బస్తాలను సురక్షితంగా దాచాలని ఆదేశించారు.



శ్రీరామసాగర్‌కు కొనసాగుతున్న వరద


శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ నుంచి గోదావరిలోకి మిగులు జలాల విడుదల కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి 39 వేల క్యూసెక్కులు వస్తుండటంతో ఎనిమిది గేట్లు ఎత్తి 24,992 క్యూసెక్కులు గోదావరిలోకి వదులుతున్నారు. జలాశయంలో 80.501 టీఎంసీల నిల్వ ఉంది. కాకతీయ కాల్వకు 4000, ఎస్కేప్ గేట్ల ద్వారా 4000, లక్ష్మి కాల్వకు 150, సరస్వతికి 500, వరద కాల్వకు 5000, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 573 క్యూసెక్కులు ఆవిరి రూపంలో తగ్గుతోంది.

సారంగపూర్ - జన్నేపల్లి రైల్వేగేటు మూసివేత



నిజామాబాద్ నగర శివారులోని సారంగపూర్ నుంచి జన్నేపల్లి మార్గంలో రైల్వే గేటు మరమ్మతు పనులు చేపడుతున్నారు. దీంతో రెండు రోజులుగా ఈ దారిని మూసేశారు. ఈ మార్గంలో వెళ్లే వాహనాలను అర్సపల్లి, గుండారం మీదుగా జన్నేపల్లి వైపు మళ్లించారు. బుధవారం రాత్రి 7 గంటల వరకు పనులు పూర్తిచేసి రాకపోకలు పునరుద్ధరిస్తామని రైల్వేశాఖ అధికారులు తెలిపారు.

- ఈనాడు, నిజామాబాద్



బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు నిధులు

మొదటి విడతలో రూ. 1.96 కోట్లు విడుదల

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

కొవిడ్ సమయంలో ప్రభుత్వం బడుల్లో స్వచ్ఛ కార్మికులను తొలగించి గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు బాధ్యత అప్పగించారు. స్థానికంగా సిబ్బంది కొరత, పనిభారంతో చాలా పాఠశాలల్లో సేవలు అందించలేదు. బడుల ప్రారంభం రోజు పిచ్చిమొక్కల తొలగింపు, మైదానం, తరగతి గదులు శుభ్రం చేయడానికే పరిమితమయ్యారు. మూత్రశాలలు, మరుగుదొడ్ల పరిశుభ్రత పట్టించుకోలేదు. కొందరు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చందాలు వేసుకొని తాత్కాలిక కార్మికులను నియమించుకోగా చాలా చోట్ల గాలికొదిలేశారు. పారిశుద్ధ్య సమస్యలు ఉపాధ్యాయ సంఘాలు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా మళ్లీ స్వచ్ఛ కార్మికులను నియమించుకోవడానికి జులై 30న ఉత్తర్వులిచ్చింది. జిల్లాలో 1156 ప్రభుత్వ, సర్కారు అనుబంధ బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు మొదటిదశలో మూడు నెలలకు సంబంధించి రూ.1.96 కోట్లు మంగళవారం విడుదలయ్యాయి. ఈ నిధులు అమ్మ ఆదర్శ కమిటీల ఖాతాలకు బదిలీ చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ వెల్లడించారు. గతంలో ఇచ్చిన ఉత్తర్వుల మేరకు స్కావెంజర్లను నియమించుకొని తరగతి గదులు, ఆవరణ, మూత్రశాలలు, మరుగుదొడ్లు శుభ్రం చేయించుకోవాలని సూచించారు.

★★★	●●●
1–30	3,000
31–100	6,000
101–250	8,000
251–300	12,000
301–750	15,000
750 ఆపై	20,000

★★★ విద్యార్థులు
●●● నెలకు చెల్లించే రూ॥

పెట్టుబడి రాయితీ రూ. 86 లక్షలు విడుదల

జిల్లాలో 676 మంది రైతులకు మంజూరు

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: వానాకాలంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పెట్టుబడి రాయితీ మంజూరు చేసిందని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుసేన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు చివరి వారం, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని పలు చోట్ల సోయాబీన్, వరి పంటలు దెబ్బతిన్న విషయం విదితమే. పంట నష్టపరిహారం నమోదు చేసిన వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం వచ్చింది. జిల్లాలో 676 మంది బాధిత రైతులకు రూ.86,38000 జమచేసినట్లు వ్యవసాయాధికారి పేర్కొన్నారు.

సర్వేయర్లు లేక.. సాగని సర్వే

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలో సిబ్బంది కొరతతో సర్వే ముందుకు సాగడం లేదు. ఏళ్ల తరబడి ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. ఉన్నవారితోనే నడిపిస్తుండటంతో సిబ్బందిపై భారం పడుతోంది. దీన్ని సాకుగా చూపి కొందరు పనులు పెండింగ్‌లో ఉంచుతున్నారు. జిల్లాలో 33 మండలాల్లో 21 మంది సర్వేయర్లు, 21 మంది డిప్యూటీ

పోస్టు	మంజూరు పోస్టులు	పని చేస్తున్నది	ఖాళీలు
సర్వేయర్లు	22	18	4
డిప్యూటీ సర్వేయర్	21	3	18
డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే	3	2	1

ఏళ్ల తరబడి పోస్టులు ఖాళీ

సర్వేయర్లు పని చేస్తున్నారు. డివిజన్ స్థాయిలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పోస్టులు మూడుంటే ఇద్దరే పని చేస్తున్నారు. కొత్త మండలాలు పోతంగల్, సాలూర, ఆలూరు, డొంకేశ్వర్‌కు సర్వేయర్, డిప్యూటీ సర్వేయర్ పోస్టులు మంజూరు లేదు. పక్క మండలాల బాధ్యులే చూసుకోవాల్సి వస్తోంది. మండల స్థాయిలో సర్వే సకాలంలో పూర్తికావడం లేదు. ఒకవేళ సర్వే చేసినా నివేదిక ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. రెండు నెలల్లో 450 దరఖాస్తులొస్తే 300లకు పైగా అపరిష్కృతంగా ఉన్నాయి.

గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం నేడు

నిజామాబాద్ సాంస్కృతికం : జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నేత అంతిరెడ్డి రాజిరెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు సంస్థ కార్యాలయంలో పూజ అనంతరం పులాంగ్ గోనెరెడ్డి కల్యాణ మండపంలో కార్యక్రమానికి హాజరవుతారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు చిక్కుముడులు


తలలు పట్టుకుంటున్న పంచాయతీ కార్యదర్శులు

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

గ్రామ పంచాయతీల్లో లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం అమలు చేయాలని సర్కారు నిర్ణయించింది. స్థలాలు కొనుగోలు చేసి దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించాలని ఆదేశించింది. సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తుండగా సమస్యలు బయటపడుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు త్వరగా పూర్తి చేయాలని అధికారుల ఒత్తిడి తేవడంతో సతమతమవుతున్నారు. గతంతో పోలిస్తే పరిస్థితులు మారిపోవడంతో ప్రక్రియ ఎలా పూర్తి చేస్తారో చూడాలి.

ఇబ్బందులు అనేకం..

ఎల్‌ఆర్‌ఎస్ కట్టిన వారిలో చాలా మంది భవనాలు నిర్మించుకున్నారు. ☛ దరఖాస్తు సమయంలో పొందుపర్చిన చరవాణి నంబర్లు సరిగా లేవు. ☛ ఎల్‌ఆర్‌ఎస్ చేయాల్సిన స్థలాలు కొందరు అమ్మేశారు. ఇప్పుడు ముందుకు రావాలని చెబితే స్పందించడం లేదు. ☛ పలు గ్రామాల్లో నాన్ లేఅవుట్ వెంచర్లు వేసి రియల్టర్లు ప్లాట్లను తక్కువ ధరకు అమ్మేశారు. తమకు ఎలాంటి సమస్య రావొద్దని స్థలం కొనుగోలు చేసిన యజమానికి తెలియకుండానే ఎల్‌ఆర్‌ఎస్ కట్టారు. పరిశీలన సమయంలో పంచాయతీ కార్యదర్శులు ఫోన్ చేసి ఎల్‌ఆర్‌ఎస్ చేసుకోవాలని సూచిస్తే యజమానులు అవాక్కవుతున్నారు. ఈ సమస్య బాల్కొండ నియోజకవర్గంలో అధికంగా ఉంది. ☛ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు సమయంలో ప్రభుత్వ పట్టా లేకపోతే రిజిస్ట్రేషన్ పత్రాలు అప్‌లోడ్ చేయాలి. కానీ చాలా మంది ఇరువురి మధ్య ఒప్పందం రాసుకున్న స్టాంప్ పేపర్లను అప్‌లోడ్ చేశారు. ☛ స్థలం వద్దకు వెళ్లి జియోట్యాగింగ్ చేసే సమయంలో ఆన్‌లైన్ సమస్య తలెత్తుతోంది. ☛ అప్పుడప్పుడు యాప్‌లో సాంకేతిక సమస్యలు వస్తున్నాయి.



కుదరని సమన్వయం..

దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మూడు దశల్లో ఉంటుంది. ఎల్-1లో మండల రెవెన్యూ అధికారి, నీటి పారుదల శాఖ ఏఈ, పంచాయతీ కార్యదర్శి స్థలాన్ని పరిశీలించి అది ప్రభుత్వ భూమా? కోర్టు కేసులు ఏమైనా ఉన్నాయ? అనేది చూడాలి. కొన్ని సందర్భాల్లో అధికారుల మధ్య సమన్వయం కుదరడం లేదు. దీంతో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. దీనిపై ఇన్‌ఛార్జి డీపీవో శ్రీనివాస్ 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సమస్యలు అధిగమించి ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు.

ఆధునికీకరణకు అడుగులు

● రవాణా శాఖలో సమూల మార్పులకు శ్రీకారం

న్యూస్‌టుడే, కామారెడ్డి నేరవిభాగం



కామారెడ్డి జిల్లా రవాణా శాఖ కార్యాలయం

రవాణా శాఖ ఆధునికీకరణ వైపు అడుగులు వేస్తోంది. దేశంలోని 28 రాష్ట్రాల్లో అమల్లో ఉన్న 'వాహన్ పోర్టల్'లో రాష్ట్ర రవాణా శాఖ చేరబోతోంది. డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ విషయంలోనూ.. దేశవ్యాప్తంగా ఒకే విధానం 'సారథి'ని అమలు చేయనున్నారు. ఈ విధానాలపై కథనం.

'వాహన్ పోర్టల్'తో..

వాహన్ పోర్టల్‌తో బీమా కంపెనీలను అనుసంధానం చేయడం వల్ల మోసాలను నియంత్రించవచ్చు. ఆధార్ కార్డ్, ఓనర్ సర్టిఫికేషన్, పొల్యూషన్ పరీక్షించుకోనే పని తప్పుతుంది. మోసాలకు అవకాశం లేకుండా పోతుంది.

స్క్రాప్ ఏజెన్సీలు రాబోతున్నాయ్: కాలం చెల్లిన వాహనాలను అమ్మడానికి ప్రభుత్వం స్క్రాప్ ఏజెన్సీలను ఏర్పాటు చేయనుంది. సదరు ఏజెన్సీ వాహనానికి ధర నిర్ణయించి చెల్లిస్తుంది. అనంతరం వారు వాహన యజమానికి పత్రాన్ని ఇస్తారు. దానిని తీసుకెళ్లి.. రవాణా శాఖ కార్యాలయంలో అప్పగిస్తే అధికారికంగా ఓ ధ్రువపత్రాన్ని అందజేస్తారు. సదరు వ్యక్తి భవిష్యత్‌లో కొత్త వాహనం తీసుకోవాలనుకుంటే.. అధికారులు ఇచ్చిన ఆ పత్రాన్ని చూపిస్తే.. వాహన ధరలో కొంత మేర తగ్గే అవకాశముంటుంది.

☛ ఏటీఎస్, ఏడీఎస్ కేంద్రాలు: వాహనాల ఫిట్‌నెస్‌ను ఏటీఎస్(ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్)లో యంత్రాలపైనే సాంకేతికత సాయంగా పరీక్షిస్తారు. జిల్లా కేంద్రంలో రూ.8 కోట్లతో 4 ఎకరాల విస్తీర్ణంలో ఏటీఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. కామారెడ్డి జిల్లాలో ఏటీఎస్ కోసం స్థలం కావాలని రవాణా శాఖ అధికారులు కలెక్టర్‌కు ప్రతిపాదించినట్లు సమాచారం.

☛ డ్రైవింగ్ టెస్టులకు ఏడీఎస్ (ఆటోమేటిక్ డ్రైవింగ్ స్టేషన్) రూపొందించనున్నారు. ఈ స్టేషన్లో ఆధునికీకరించిన ట్రాక్ ఏర్పాటు చేస్తారు. ఈ ట్రాక్‌లను కంప్యూటరీకరిస్తారు. సరైన విధానంలో వాహనాన్ని నడుపుతున్నారా లేదా అని సాంకేతికత ఆధారంగా పరీక్షించి డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. ఏడీఎస్‌ల ఏర్పాటు కోసం కామారెడ్డిలో 6 ఎకరాలు, బాన్సువాడలో 3 ఎకరాలు కేటాయించాలని రవాణా శాఖ అధికారులు ప్రతిపాదించారు.

విద్యాసంస్థల్లో పార్కుల ఏర్పాటు

విద్యార్థుల్లో రోడ్డు భద్రతా నియమావళిపై అవగాహన పెంచేందుకు ఒక్కో విద్యాసంస్థలో రూ.2.50 లక్షలతో 'రోడ్ సేఫ్టీ చిల్డ్రన్ పార్క్'ను ఏర్పాటు చేస్తారు. తొలుత ప్రైవేట్ విద్యాసంస్థల్లో అమలుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. కామారెడ్డి జిల్లాలో నాలుగు ప్రైవేట్ పాఠశాలల్లో చిల్డ్రన్ పార్కుల ఏర్పాటుకు యాజమాన్యాలు ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. 'వాహన్ పోర్టల్', 'సారథి' అమలుతో పారదర్శకతకు అవకాశముంటుంది. అక్రమాలను పూర్తిగా నివారించవచ్చు. రహదారి ప్రమాదాలను కట్టడి చేయవచ్చు. అధికారులకు పని భారం తగ్గే అవకాశాలున్నాయి.' అని కామారెడ్డి జిల్లా రవాణా శాఖ ఇన్‌ఛార్జి అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

సన్నాల కొనుగోళ్లలో సాంకేతికత

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్



రాష్ట్ర సర్కారు ఈ సారి సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించగా.. సాంకేతికత ఆధారంగా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారు.

గింజలు తీయడానికి 'ప్యాడీ హస్కర్'

ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి రెండు ప్యాడీ హస్కర్ యంత్రాలను అందజేయనున్నారు. గుప్పెడు వడ్లు తీసుకుని ఈ యంత్రంలో పోసి తిప్పితే పొట్టు ఊడిపోయి బియ్యం గింజలు బయటకు వస్తాయి. ఆ విధంగా బయటకు వచ్చిన బియ్యం గింజలను గ్రెయిన్ కాలిపర్ యంత్రంలో పోసి సన్న రకం బియ్యమో కాదో తెలుసుకుంటారు.

'గ్రెయిన్ కాలిపర్'తో గుర్తింపు

సన్నధాన్యం గుర్తించేందుకు ప్రతి కొనుగోలు కేంద్రానికి గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రోమీటర్) యంత్రం అందజేస్తున్నారు. ఈ యంత్రం సాయంతో బియ్యం గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. పొడవు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ, వెడల్పు 2 మి.మీ కంటే తక్కువ ఉండాలని ప్రమాణాలు నిర్దేశించారు. ఈ యంత్రం వినియోగంపై కేంద్రాల నిర్వాహకులకు ఇప్పటికే అవగాహన కల్పించారు.

సంచులపై కోడ్

ధాన్యం సంచులపై కొనుగోలు కేంద్రం కోడ్, ధాన్యం రకం వివరాలు నమోదు చేస్తారు. సన్న రకమైతే ఎరుపు రంగుతో కొనుగోలు కేంద్రం నంబరు, ధాన్యం రకం వద్ద 'ఎస్' అని రాస్తారు. దొడ్డ రకం సంచులపై ఆకు పచ్చ రంగుతో కొనుగోలు కేంద్రం నంబరు, ధాన్యం రకం వద్ద 'డీ' అని రాస్తారు. సన్న రకాన్ని సంబంధిత ఏఈవోలు ధ్రువీకరిస్తారు.

ఐరిస్ విధానం

ధాన్యం కొనుగోళ్లలో ఇది వరకు ఓటీపీ విధానం అనుసరించేవారు. కేంద్రం నుంచి లారీల్లో ధాన్యాన్ని పంపేటప్పుడు ఓటీపీ తీసుకొని ట్రక్‌షీట్‌ను మిల్లులకు పంపేవారు. ఇప్పుడు సంబంధిత రైతు ఐరిస్ తీసుకోనున్నారు.

పవన్.. కెమెరామెన్

● సినిమాల్లో రాణిస్తున్న బీబీపేట మండలవాసి

న్యూస్‌టుడే, బీబీపేట(కామారెడ్డి)



చిన్నప్పటి నుంచి సినిమాలపై మక్కువ పెంచుకున్నాడు. ఆ మక్కువతోనే నేడు కెమెరామెన్‌గా రాణిస్తున్నాడు. అతడే బీబీపేట మండలం తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన పవ్వల పవన్‌కుమార్. పవన్‌కు సినిమాల్లో దర్శకత్వం చేయాలనే తపన ఎక్కువగా ఉండేది. డిగ్రీ పూర్తయిన తర్వాత కుటుంబ సభ్యులను ఒప్పించి ఢిల్లీ ఫిల్మ్ స్కూల్‌లో 2012లో అడ్మిషన్ పొందాడు. రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన తర్వాత తన స్నేహితుడి ద్వారా ఓ కెమెరామెన్ దగ్గర అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేయడం మొదలు పెట్టాడు. అలా పనిచేసే సమయంలోనే కొన్ని ప్రైవేటు, వాణిజ్య వ్యాపారాలకు సంబంధించిన ప్రకటనలను చిత్రీకరించాడు. అక్కడ నుంచి ప్రముఖ తమిళ్ కెమెరామెన్ ముఖేష్ వద్ద అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశాడు. అలా అనుభవం సాధించి ఇటీవల రెండు సినిమాలకు తానే కెమెరా మెన్‌గా పనిచేశాడు.

పనిచేసిన సినిమాలు

తెలుగులో రోగ్, ఇజం, పైసా వసూల్, నేలటికెట్టు సినిమాలకు, హిందీలో అధిత్, నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న బాహుబలి(ది రైజ్ ఆఫ్ శివగామి) అనే వెబ్‌సిరీస్‌కు పవన్ అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశాడు. ఉస్తాద్ సినిమాకు, ప్రస్తుతం ప్రొడక్షన్ దశలో ఉన్న అనగనగా(ఈటీవీ విన్ ఒరిజినల్స్)కు కెమెరామెన్‌గా చేశారు.

దర్శకుడు కావాలనే లక్ష్యం

- పవన్‌కుమార్ పవ్వల

సినిమాలపై ఇష్టంతో ఇండస్ట్రీలో కెమెరామెన్‌గా పనిచేస్తున్నాను. కెమెరామెన్‌కు, దర్శకుడికి దగ్గర సంబంధం ఉంటాయి. దర్శకుడి మదిలోని కథను దృశ్యంగా చూపేవాడే కెమెరామెన్(మాటోగ్రాఫర్). కెమెరామెన్‌గా మంచి సినిమాలు తీసి ఆ తర్వాత మంచి దర్శకుడిగా ఎదగాలన్నదే లక్ష్యం. దర్శకత్వం చేయడం కోసం కొన్ని కథలను సైతం సిద్ధం చేస్తున్నాను.

లెక్కలేనితనంపై సర్కారు గుర్రు

- జిల్లాలో ప్రారంభించని డిజిటల్ సర్వే
- ధాన్యం కొనుగోళ్లపై ప్రతిష్టంభన
- నలుగురు ఏఈవోలపై వేటు

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం



ఏ పంట ఎక్కడ? ఎంత వేశారు? అనే దానిపై కేంద్రం తీసుకొచ్చిన డిజిటల్ సర్వే జిల్లాలో ఇంకా ప్రారంభం కాలేదు. ఇప్పటికే సాగు విస్తీర్ణంలో సగానికి పైగా కోతలు పూర్తయ్యాయి. వారం పది రోజులైతే వానాకాలం సీజన్ ముగుస్తుంది. ఈ తరుణంలో లెక్కలు తీసినా ఉపయోగం లేదు. వ్యవసాయ విస్తర్ణాధికారులు (ఏఈవోలు) ఇది పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. అయినా రాష్ట్రవ్యాప్తంగా ఏఈవోలు ససేమిరా అంటున్నారు. దాదాపు నెల రోజులుగా ప్రతిష్టంభన కొనసాగుతుండగా తాజాగా జిల్లాలో నలుగురు సిబ్బందిపై వేటు వేశారు.

మెమోలిచ్చినా మారని తీరు..

డిజిటల్ యాప్‌ను తమ ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుంటేనే హాజరు పడుతుంది. ఎక్కడ.. ఏం చేశారో చిత్రంతో సహా అందులో నమోదవుతుంది. ఇది ఎప్పటికప్పుడు మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ఉన్నతాధికారులకు తెలుస్తుంది. రాష్ట్ర యూనియన్ నేతల పిలుపుమేరకు సిబ్బంది జిల్లాలోనూ యాప్ డౌన్‌లోడ్‌కు నిరాకరించారు. దీనిపై గుర్రుగా ఉన్న ఉన్నతాధికారులు జిల్లాలో 107 మంది ఏఈవోలకు ఇప్పటికే మెమోలిచ్చారు. తాము రాష్ట్ర నాయకత్వం నిర్ణయం మేరకే నడుచుకుంటామని, విధులకు హాజరవుతూనే నిరసన తెలుపుతున్నట్లు ఏఈవోల సంఘం ప్రతినిధులు 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

వేటుపడిన ఏఈవో స్థానాలు		
మండలం	క్లస్టర్	పేరు
ఆర్మూర్	ఆర్మూర్	సవిత
ఆలూర్	ఆలూర్	వసుధం
ఎడపల్లి	ఎడపల్లి	జ్యోతి
ని॥ రూరల్	గుండారం	రాకేశ్

ఒప్పంద సిబ్బందికి ఇబ్బంది

వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాల్లో జిల్లావ్యాప్తంగా 8 మంది ఏఈవోలను రూ.16 వేల వేతనం చెల్లిస్తూ ఒప్పంద పద్ధతిపై నియమించారు. రెగ్యులర్ సిబ్బందితో కలిసి డిజిటల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోకుండా విధులకు గైర్హాజరవుతుండటంతో వీరి మెడపై కత్తి వేలాడుతోంది. సర్వేలో పాల్గొనకుంటే ఎక్కడ తమ ఉద్యోగాలకు ఎసరు వస్తుందోననే ఆందోళన వారిలో మొదలైంది.

ధాన్యం సేకరణ కష్టమే..

ఈ ఏడాది జిల్లాలో 5.49 లక్షల ఎకరాల్లో పంటలేయగా వరి ఒక్కటే 4.29 లక్షల ఎకరాల్లో ఉంది. సన్నాలు 3.60 లక్షల ఎకరాల్లో ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ గ్రామీణం, ఆర్మూర్ డివిజన్లలో వరి కోతలు సగం పూర్తయ్యాయి. సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో వాటిని గుర్తించడంలో ఏఈవోలది కీలక పాత్ర. మహారాష్ట్రతో సరిహద్దు ఉండటంతో ఆ ధాన్యం ఇక్కడికి రానీయకుండా వ్యవసాయశాఖ సిబ్బందికి తనిఖీ కేంద్రాల వద్ద విధులు కేటాయించారు. ఈ పరిస్థితుల్లో విధులకు దూరంగా ఉంటే కొనుగోళ్లు నిలిచేపోయే ప్రమాదం ఉంది.

నిర్లక్ష్యం వల్లే చర్యలు

- వాజీద్ హుస్సేన్, నిజామాబాద్ జిల్లా వ్యవసాయాధికారి

రాష్ట్రవ్యాప్త చర్యల్లో భాగంగా నలుగురు ఏఈవోలను సస్పెండ్ చేశాం. వీరు రైతు బీమా, ఇతరత్రా సంక్షేమ పథకాల అమల్లో నిర్లక్ష్యం వల్లే వేటు వేశాం. ఒప్పంద సిబ్బందిని విధుల్లో చేరాలని పిలిచాం. ప్రభుత్వ నిర్ణయాలు పాటించాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతివ్వాలి



మాట్లాడుతున్న కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్

నిజామాబాద్ విద్యావిభాగం, న్యాయవిభాగం న్యూస్‌టుడే : త్వరలో జరగనున్న విద్యావంతుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్ స్థానం నుంచి పోటీ చేస్తున్నానని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల సమస్యపై తనకు పూర్తి అవగాహన ఉందని కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్ అన్నారు. నగరంలోని కోటగల్లీ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో హెచ్‌ఎం వాసుదేవరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో తనకు మద్దతివ్వాలని కోరారు. ఎంఈవోలు సేవ్లానాయక్, సాయిరెడ్డి, ఆర్‌వీఎన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిజామాబాద్ బార్ అసోసియేషన్‌ను సందర్శించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, సీనియర్ న్యాయవాదులు కృష్ణనంద్, జగదీశ్వర్‌రావు, రాజలింగం, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేమి.. పట్టించుకోరేమి?

● కామారెడ్డిలో ఇష్టారీతిన కల్వర్టు పనులు

కామారెడ్డి జిల్లాకేంద్రం సైలన్‌బాబా కాలనీలో రెండేళ్ల క్రితం రూ.60 వేలతో కల్వర్టు నిర్మించారు. నిర్మాణ సమయంలో నీళ్లతో సరిగా క్యూరింగ్ చేయలేదు. దీంతో అనతికాలంలోనే కంకర తేలి అధ్వానంగా మారింది. ఈ మార్గంలో నిత్యం 300- 400 వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పగుళ్లుబారి కుంగిపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది.



పరిశీలన

జిల్లాకేంద్రం రామారెడ్డి రోడ్డుకు వెళ్లే చోట 20 నెలల క్రితం కల్వర్టు నిర్మించారు. ఇది పూర్తిగా కంకర తేలి నాణ్యతా లోపాలు వెలుగు చూశాయి. పనులు చేసేటప్పుడు యంత్రాంగం పర్యవేక్షణ కొరవడటంతో ప్రగతి గాడి తప్పింది.



న్యూస్‌టుడే,కామారెడ్డి పట్టణం

కామారెడ్డి జిల్లాకేంద్రంలో	
వార్డులు:	49
కల్వర్టులు:	380–400
పాడైనవి:	50–60

పది కాలాల పాటు మన్నాల్సిన ప్రగతి పనులు ఏడాది నుంచి రెండేళ్ల లోపే దెబ్బతింటున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పనుల్లో నాణ్యత లోపాలు వెలుగు చూస్తున్నాయి. మూడేళ్లలో 30 నుంచి 40 కల్వర్టులు పాడయ్యాయి. కొన్ని చోట్ల కూలిపోయాయి.

సర్వే చేపడితే మేలు

వార్డుల్లో అనేక ప్రాంతాల్లో ఒక రోడ్డు నుంచి మరో చోటుకు వెళ్లేందుకు వీలుగా కల్వర్టులు నిర్మిస్తారు. ఆయా వార్డుల్లో 8-10 కల్వర్టులు ఉంటాయి. ఇవి గుత్తేదారులకు కలిసి వస్తున్నాయి. నాసిరకంగా చేపట్టడంతో త్వరగా కూలిపోతుండటంతో అక్కడ తిరిగి పనులు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది. పురపాలక శాఖ అధికారులు వార్డుల్లో జరిగే ప్రగతి పనులను పర్యవేక్షించాలి. ఏఈ స్థాయి అధికారి దగ్గరుండి మరీ వీటిని పరిశీలించాలి. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు లేవు. ఈ విషయమై పుర కమిషనర్ సుజాత స్పందిస్తూ.. పనులు పారదర్శకంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటామని, పాడైన కల్వర్టుకు మరమ్మతులు చేపడతామన్నారు.

గొలుసు చోరీ దొంగల రిమాండ్

వేల్పూర్, న్యూస్‌టుడే : ఓ మహిళ మెడలోంచి బంగారు గొలుసు దొంగిలించిన ఇద్దరిని వేల్పూర్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, వేల్పూర్ ఎస్సై నాగ్‌నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ద్విచక్రవాహనంపై మెట్‌పల్లి నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్న ఇద్దరు దుండగులు వేల్పూర్ క్రాస్ రోడ్డు వద్ద ఇద్దరు మహిళలు బస్ కోసం వేచి ఉండటాన్ని గమనించారు. అందులోని ఓ మహిళ మెడలోంచి రెండున్నర తులాల బంగారం గొలుసు లాక్కుని అక్కడి నుంచి పరారయ్యారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల సాయంతో ద్విచక్రవాహనం, వారు ధరించిన దుస్తుల ఆధారంగా లక్కోర శివారులో నిందితులను పట్టుకున్నారు. నిందితులు ఇబ్రాన్ పల్లి మండలం అర్గుల్‌కు చెందిన షేక్ జైలద్దీన్, నిర్మల్‌కు చెందిన భూంపల్లి సంతోష్‌గా గుర్తించారు. వీరు మెట్‌పల్లిలో గొలుసు విక్రయించేందుకు వెళ్తున్నట్లు పోలీసులు తెలిపారు. గొలుసు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పోలీసు అధికారి సస్పెన్షన్

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే : అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తిపై విచారణ చేపట్టిన అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు మంగళవారం డీజీపీ ఉత్తర్వులు జారీచేశారు. ఆయన ఏసీపీగా ఉన్నప్పుడు ఆరోపణలు రావడంతో అప్పటి సీపీ కల్మేశ్వర్ విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదించగా ఈ నెల 11న డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఆరోపణలు నిర్ధారణ కావడంతో తాజాగా చర్యలు తీసుకున్నారు. ఆయనతో పాటు కానిస్టేబుళ్లు రాములు, సుధాకర్ ఇది వరకే సస్పెండ్ అయ్యారు. టాస్క్‌ఫోర్సు విభాగంలో సీఐతో పాటు ఐదుగురు సిబ్బందిని బదిలీ చేయడంతో పూర్తిగా ఖాళీ అయింది. కొత్తవారు వచ్చే వరకు కార్యాలయం మూసే ఉంటుంది.

టీపీసీసీ అధ్యక్షుడి పూజలు



మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న పండితులు, అధికారులు

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: నీలకంఠేశ్వరాలయంలో మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పూజలు చేశారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన అభిమానులు అన్నదానం చేశారు. ఆలయ ఈవో రవీందర్, పూజారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కుటుంబం ఎన్నో ఏళ్ల నుంచి కంఠేశ్వరుడి సేవలో ఉందని, ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. నుడా ఛైర్మన్ కేశవేణు, నాయకులు నరాల రత్నాకర్, లలిత, వినయ్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారిణి రసూల్‌బీ

బాలల చట్టాలపై అవగాహన

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: గ్రామాలు, తండాల్లో బాలల చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా సంక్షేమాధికారిణి రసూల్‌బీ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలీస్ శాఖ నుంచి సహాయ సహకారాలు అందిస్తామని అదనపు డీసీపీ బస్వారెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ సంపూర్ణ, సభ్యులు శోభారాణి, రాజేంద్రప్రసాద్, బాల రక్షాభవన్ సమన్వయకర్త విజయలక్ష్మి, డీసీపీవో చైతన్య తదితరులు పాల్గొన్నారు.

తెవివి అభివృద్ధే లక్ష్యం కావాలి

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో తెవివి నూతన వీసీ ఆచార్య టి.యాదగిరి రావు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య యాదగిరిరావును ఉద్దేశించి తెవివిని రాష్ట్రంలోనే మోడల్ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేయాలని సీఎం సూచించారు. వీసీ మాట్లాడుతూ.. వర్సిటీలో మౌలిక వసతుల కల్పనకు సరైన ప్రణాళికతో వస్తే ప్రభుత్వం తరపున నిధులు మంజూరు చేసి అన్ని విధాలుగా సహకరిస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. త్వరలోనే వర్సిటీలో నెలకొన్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని తెలియజేశారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న తెవివి ఉపకులపతి ఆచార్య యాదగిరిరావు, చిత్రంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

28లోపు చెల్లించాలి

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: తెవివి పరిధిలోని ఎంఈడీ మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు అక్టోబర్/నవంబర్-2024 బ్యాచ్ విద్యార్థులకు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 28వ తేదీ లోపు చెల్లించాలని వర్సిటీ సీవోఈ ఆచార్య అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుముతో నవంబర్ 1 తేదీ వరకు చెల్లించవచ్చని వివరించారు. పూర్తి వివరాలు వర్సిటీ వెబ్‌సైట్లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

వర్సిటీల సదస్సు జయప్రదానికి పిలుపు

తెవివి క్యాంపస్ : ఎస్సీ వర్గీకరణపై చేపట్టాల్సిన భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా కాకతీయ వర్సిటీలో మాదిగ విద్యార్థులతో ఈ నెల 24న వర్సిటీల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంఎస్‌ఎఫ్ నాయకులు తెలిపారు. మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై పోరాటానికి సిద్ధం కావాలని ఎంఎస్‌శ్రీష్ పేర్కొన్నారు.

వైద్య విద్యార్థికి బంగారు పతకం

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎన్.లావణ్యకు తెలంగాణ కేఎన్‌ఆర్ వర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బంగారు పతకం అందజేసింది. ఫిబ్రవరి 2024లో నిర్వహించిన పరీక్షలో ఈఎస్టీ సబ్జెక్టులో ఆమె ప్రథమ స్థానంలో నిలిచారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ మంగళవారం విద్యార్థినిని అభినందించారు. హెచ్‌వోడీ హరీశ్ స్వామి, వైద్యురాలు కాత్యాయిని పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

ప్రయాణికుల కళ్లలో దుమ్ము



రహదారిని ఆనుకుని ఉన్న ఓ రైస్ మిల్లులోంచి నిత్యం దుమ్ము వెలువడుతుండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. 11వ రాష్ట్ర రహదారి నుంచి కామారెడ్డి మండలం క్యాసంపల్లి, రాఘవాపూర్, దోమకొండ మండలం చింతామన్‌పల్లి, ముత్యంపేట గ్రామాల మీదుగా దోమకొండకు వెళ్లే దారిలో ఈ దుస్థితి నెలకొంది. నిత్యం ప్రయాణికుల కళ్లలో దుమ్ము పడుతున్నా పట్టించుకునే వారు లేరు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కామారెడ్డి అర్బన్

ఆకస్మిక తనిఖీ

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే : ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న జోన్-2 (గోల్‌హనుమాన్) కార్యాలయాన్ని మంగళవారం నగర కమిషనర్ మకరంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు ప్రజాపాలన దరఖాస్తులు, నమోదు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.




సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ మకరంద్

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

కూలిన ప్రహరీ



నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ నగరంలోని డీఎస్ఏ ఈతకొలను ప్రహరీ సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కూలింది. ఉదయం వచ్చిన సిబ్బంది ఈ విషయాన్ని డీవైఎస్‌వో ముత్తెన్న దృష్టికి తీసుకెళ్లారు.

సీఎస్‌సీ ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని దుబ్బ ఆదర్శనగర్ ప్రాంతంలో సీఎస్‌సీ ఆధార్ సేవా కేంద్రాన్ని అదనపు పాలనాధికారి కిరణ్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటికీ ఆధార్ ముఖ్యమని, ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ మకరందు, తహసీల్దార్లు బాల్‌రాజు, నాగర్జున, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తిక్, సీఎస్‌సీ జిల్లా మేనేజర్ గౌతం తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

★★★ నగరంలోని కోటగల్లీ శివాలయం పక్క నుంచి కొంత దూరం వరకు నల్లా పైపులు బిగించేందుకు రోడ్డును తవ్వారు. సరిగా పూడ్చక పోవడంతో ఇంట్లోకి వెళ్లేందుకు ఇబ్బంది ఉంది. **- మురళి, స్థానికుడు**

★★★ సిబ్బందిని పంపి చర్యలు తీసుకుంటాం. **- ఇనాయత్, ఏఈ, జోన్-2, నగర పాలక సంస్థ**



★★★ నాగారంలో ప్రభుత్వ పాఠశాల సమీపంలో పైపులైన్ లీకేజీ కారణంగా ఐదు రోజుల కిందట ఐదు అడుగుల గుంత తవ్వారు. ఇప్పటి వరకు మరమ్మతు చేయలేదు. ఆరు రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. గుంతలో పిల్లలు పడే ప్రమాదం ఉంది. **- మహేష్, స్థానికుడు**

★★★ పైపులైన్ లోతులో ఉండడంతో పనులు ఆలస్యమవుతున్నాయి. మెటీరియల్ హైదరాబాద్ నుంచి తెప్పించాల్సి వచ్చింది. బుధవారం ఉదయం వరకు మరమ్మతులు చేసి పూడ్చేస్తాం. **- సల్మాన్, ఏఈ**

★★★ నగరంలోని పద్మానగర్ కాలనీ ఎదురుగా రాఘవేంద్ర ఇడ్లీ సెంటర్ పక్క కాలనీకి చెత్త బండి రావడం లేదు.
- పద్మా, స్థానికురాలు

★★★ చెత్త బండి రిపేర్‌లో ఉంది. రెండు, మూడు రోజులకు ఒకసారి ట్రాక్టర్ లేదా టిప్పర్ పంపిస్తున్నాం.
- సునీల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

★★★ జలాల్‌పూర్‌లో శ్మశానవాటికకు వెళ్లే మట్టి రోడ్డు గుంతలుగా మారింది.
- రవి, గ్రామస్థుడు

★★★ గుంతల్లో మట్టి వేయించి పూడ్చేస్తాం.
- అర్జున్, కార్యదర్శి

- న్యూస్‌టుడే, నిజామాబాద్ గ్రామీణం నిజామాబాద్ నగరం, నిజామాబాద్ అర్బన్

ఆహ్లాదంగా మినీ ట్యాంక్‌బండ్

ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు డిచ్‌పల్లి మండలంలోని... విజన్-I కాలూరు గ్రామంలో ఊర చెరువు కట్టపై నిర్మించిన మినీ ట్యాంక్ బండ్ ఆకట్టుకుంటోంది. నిజామాబాద్ నగరానికి కూతవేటు దూరంలో ఉండటంతో సేద తీరేందుకు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. వివిధ మొక్కలు, చెట్లతో ఇక్కడ పార్కు ఏర్పాటు చేశారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ, స్వామి వివేకానంద విగ్రహాలు, దేవాలయాలు, గోడపై గీసిన పలు చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చెరువు కట్టపై 250 మీటర్ల పరిధిలో 2022లో నుడా నిధులు రూ.87 లక్షలతో ఈ ట్యాంక్‌బండ్ నిర్మించారు.

– న్యూస్‌టుడే, మోపాల్ (నిజామాబాద్ గ్రామీణం)

ప్రశాంత వాతావరణంలో..

సాయంత్రం వేళల్లో ఇక్కడికి కుటుంబ సభ్యులతో వచ్చి ప్రజలు ఆనందంగా గడుపుతున్నారు. శివాలయం, హనుమాన్ ఆలయాలు ఉండటంతో ఆధ్యాత్మికత సంతరించుకుంది. వివిధ చిత్రాలు వీక్షకులను ఆకట్టుకుంటున్నాయి. గ్రామంలో బతుకమ్మ పండగ సమయంలో మహిళలు ఆడిపాడి ఊర చెరువులోనే నిమజ్జనం చేస్తారు. ట్యాంక్‌బండ్ నిర్మాణం జరగక ముందు నిమజ్జనం చేసేందుకు ఇబ్బందిగా ఉండేది. నిర్మాణం పూర్తి చేసి మెట్లు నిర్మించడంతో సౌకర్యవంతంగా మారింది.

బోటింగ్ సదుపాయం కల్పించాలి

నగరానికి దగ్గరగా ప్రధాన రహదారి పక్కనే ట్యాంక్‌బండ్ ఉండటంతో ఉదయం సాయంత్రం వేళల్లో చుట్టు పక్కల గ్రామస్థులు, నగర వాసులు కుటుంబ సమేతంగా వస్తూంటారు. చెరువు పరిధి 500 మీటర్ల మేర అభివృద్ధి చేయాలి. చెరువులోని గుర్రపు డెక్క తొలగించి బోటింగ్ సదుపాయం కల్పించాలి. **- సంతోష్, గ్రామస్థుడు**



మినీ ట్యాంక్ బండ్‌పై ఆకట్టుకుంటున్న నిర్మాణం

చివరికి కష్టాలే..!

న్యూస్‌టుడే, కోటగిరి, పోతంగల్

కోటగిరి, పోతంగల్ మండలాల్లో వరి కోతలు ప్రారంభమై 15 రోజులు కావొస్తుంది. ఇప్పటి వరకు 50శాతం కోతలు పూర్తయ్యాయి. కొందరు రైతులు పచ్చి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించుకోగా.. చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో గత నాలుగైదు రోజులుగా వానలు కురవడంతో రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం తడిసింది. హెగ్డోలి, ఎత్తొండ గ్రామాల్లో రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం వర్షాలకు మొలకలు వచ్చాయి. కోటగిరి, పోతంగల్, హంగర్గ తదితర గ్రామాల్లో వర్షాలు, వీచిన గాలులకు వరి నేలవాలింది.



హెగ్డోలిలో వర్షాలకు మొలకెత్తిన ధాన్యం

అధికారులు నామమాత్రంగా కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు మరిచారని రైతులు చెబుతున్నారు. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని, తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు.

రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి: ఎమ్మెల్యే

మోపాల్, న్యూస్‌టుడే: జిల్లాలో రికార్డు స్థాయిలో 9 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి రానుందని ఎమ్మెల్యే భూపతిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మోపాల్, కులాస్పూర్‌లలో ఆరోగ్య ఉప కేంద్రాల భవనాలు, కులాస్పూర్ తండాలో గ్రామ పంచాయతీ భవనం, కంజరలో సొసైటీ గోదాంలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. దొడ్డు, సన్న రకాలకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొంటుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నియోజకవర్గానికి రూ.125 కోట్లతో 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరైందన్నారు. ఏఎంసీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, గంగారెడ్డి, మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కంజరలో నిర్మించిన సొసైటీ గోదాం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, చిత్రంలో మేయర్ నీతూకిరణ్

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

నిజామాబాద్ నగరం: నగరంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మేయర్ నీతూకిరణ్ మంగళవారం అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. 22, 23వ డివిజన్లలో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. సుమిత్ర, కిశోర్, కల్పన, మల్లేష్, ఉమారాణి, ముత్యాలు, లత, కృష్ణ పాల్గొన్నారు.

ఎట్టకేలకు సొంత శాఖకు బదిలీ

నిజామాబాద్ నగరం : నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య పర్యవేక్షకుడిగా పనిచేస్తున్న నటరాజ్ గౌడ్‌ను సొంత శాఖకు (జిల్లా వైద్యారోగ్యశాఖ)కు పంపిస్తూ నగర కమిషనర్ మకరంద్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన గత 14 ఏళ్లుగా డిప్యుటేషన్‌పై నగరపాలక సంస్థలో కొనసాగగా ఎట్టకేలకు బదిలీ అయ్యారు.

డీఏలు విడుదల చేయాలి

డిచ్‌పల్లి గ్రామీణం : పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు డిచ్‌పల్లి మండలంలోని అన్ని పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని కోరారు. 43 శాతం ఫిట్‌మెంట్‌తో పాటు పీఆర్‌సీని ప్రకటించాలని కోరారు. ఈమేరకు ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సంఘ బాధ్యులు మధుసూదనచారి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బోర్గాం(పి)(మోపాల్) : పెండింగ్ డీఏలు, అన్నిరకాల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ ఉపాధ్యాయులు మంగళవారం బోర్గాం(పి) జడ్పీహెచ్ఎస్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆందోళన చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కృష్ణవేణి, బద్రీనాథ్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని పాఠశాలల్లో బిల్లులు, డీఏలు విడుదల చేయాలని కోరారు. మండల బాధ్యులు మహేశ్వర్‌రెడ్డి, గంగాధర్,జిల్లా బాధ్యులు శ్యామ్, రమ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో చేరిక

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: పౌర సరఫరాల కార్పొరేషన్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం ఏఐటీయూసీలో చేరారు. ఈ మేరకు ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, హనుమాన్లు, దేవేందర్ పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో పూజలు

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: బోధన్ మండలం మావందిఖుర్దులోని మహాలక్ష్మి ఆలయంలో గ్రామస్థులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఇటీవల అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన చేయడంతో భక్తులు ఆలయాన్ని సందర్శించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రతినిధులు

ఉపకార వేతనాలు విడుదల చేయాలని ధర్నా

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను చిన్న చూపు చూస్తోందని జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ విమర్శించారు. మెస్‌ఛార్జీలు పెంచాలని కోరారు. ధర్నాలో వెంకటేశ్, గణేశ్, శేఖర్, వెంకట్, శ్రీను, శ్రవణ్ పాల్గొన్నారు.

పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఖలీల్ వాడి, న్యూస్ టుడే: పింఛనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు మంగళవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, నగదు రహిత వైద్యం అన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనుమతించేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, కోశాధికారి నారాయణ, మధుసూదన్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు వినతి పత్రం అందిస్తున్న ప్రతినిధులు

26, 27న సీపీఎం మహాసభలు

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: సీపీఎం జిల్లా మహాసభలు ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మహాసభలు రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో జరుగుతాయని ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య, భాస్కర్, జ్యోతి హాజరు కానున్నారని తెలిపారు. కార్మిక, కర్షక, మహిళలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వెంకట్రాములు, నూర్జహాన్ పాల్గొన్నారు.



సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు



డిచ్‌పల్లిలో..

కుమురం భీం జయంతి

కుమురం భీం జయంతిని మంగళవారం నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గంలోని వివిధ మండకేంద్రాలు, గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఆయన విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమురం భీం అందించిన సేవలు కొనియాడారు. ఆయన జీవితం పోరాట స్ఫూర్తికి నిదర్శనమని చెప్పారు.

న్యూస్‌టుడే బృందం



కొండూరులో..

రక్షణ గోడలు ఏర్పాటు చేయరూ..!

నవీపేట బస్టాండ్ మీదుగా బాసర వెళ్లే ప్రధాన చౌరస్తా మూల మలుపు వద్ద ఉన్న కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. దీంతో ప్రయాణించే సమయంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై ప్రతి రోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులూ లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది.




కల్వర్టుపై ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఈనాడు - నిజామాబాద్

రహదారిపై లారీలు.. ప్రమాదాలకు కారకాలు

న్యూస్‌టుడే, వర్ని

వరికోతలు ఊపందుకోవడంతో వివిధ ప్రాంతాల నుంచి ధాన్యం కోసం లారీలు వందల సంఖ్యలో వర్నికి చేరుకుంటున్నాయి. వాటిని నిలిపేందుకు సరైన స్థలం లేకపోవడంతో నిజామాబాద్-బోధన్ రహదారికి ఇరువైపులా నిలుపుతున్నారు. దీంతో రోడ్డు ఇరుకై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వర్ని శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురు గాయపడ్డారు. రైస్‌మిల్లులు ఉన్నచోటే ధాన్యం తీసుకెళ్లే లారీలు ఆపడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేగాక సత్యనారాయణపురం మూలమలుపు ప్రాంతాల్లో సైతం నిర్లక్ష్యంగా లారీలు నిలుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. మార్కెట్ కమిటీకి వెళ్లే రోడ్డులో రెండు ఉపకాలువలకు రక్షణ గోడలు లేక లారీలు బోల్తాపడ్డ ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ రోడ్డును వెడల్పు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సాయిలు మాట్లాడుతూ.. పరిశీలించి ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తానని చెప్పారు.



బోధన్-నిజామాబాద్ రహదారిపై..

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఖలీల్‌వాడి: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని అత్యాచారం చేసి చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ధర్నాచౌక్‌లో నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు భూమన్న, మోహన్ పాల్గొన్నారు.

రత్నాకర్ తల్లికి పరామర్శ

నిజామాబాద్ అర్బన్: కాంగ్రెస్ నేత నరాల రత్నాకర్ తల్లికి ఇటీవల శస్త్ర చికిత్స చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితి ఆరా తీసి పరామర్శించారు.

రైలు కిందపడి ఆత్మహత్య

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: గుర్తుతెలియని రైలు కిందపడి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. అంకాపూర్ రైల్వే వంతెన వద్ద రైలు కిందపడి మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి(50) బలవన్మరణం చెందారు. మృతదేహాన్ని నిజామాబాద్ జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎవరైనా గుర్తిస్తే 8712658591 నంబరులో సంప్రదించాలని రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు.

మృతదేహం లభ్యం

రెంజల్, న్యూస్‌టుడే: కందకుర్తి గోదావరి నదిలో స్నానానికి వచ్చి సోమవారం గల్లంతైన మాధవ్(38) అనే వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యం కాగా వెలికితీసినట్లు ఎస్సై ఈ. సాయన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బోధన్ పట్టణం పోస్టాఫీస్ ప్రాంతానికి చెందిన మాధవ్ తన కుటుంబంతో కలిసి సోమవారం గోదావరిలో స్నానానికి వచ్చి నదిలో గల్లంతయ్యారు. జాలరులతో మంగళవారం మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు చెప్పారు. మాధవ్‌కు పదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ద్విచక్రవాహనం అపహరణ

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో ద్విచక్రవాహనం చోరీ అయింది. దుబ్బ ప్రాంతానికి చెందిన రాజు తన ద్విచక్రవాహనంపై సోమవారం జీజీహెచ్‌కు వచ్చారు. వాహనం పార్కింగ్ స్థలంలో నిలిపి లోపలికి వెళ్లారు. కొద్ది సేపటికి తిరిగి వచ్చి చూసేసరికి ద్విచక్ర వాహనం లేదు. చుట్టుపక్కల వెతికినా దొరకకపోవడంతో మంగళవారం ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశారు.

క్రైమ్ కార్నర్

ఇంట్లో చోరీ

● ఇద్దరు దొంగలను పట్టుకున్న పోలీసులు

ఎడపల్లి, న్యూస్‌టుడే: జానకంపేటకు చెందిన గడ్డం సంతోష్ ఇంట్లో సోమవారం రాత్రి ఇద్దరు దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై వంశీకృష్ణ కథనం ప్రకారం.. సంతోష్ కూతురు అనారోగ్యానికి గురై నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానాలో చికిత్స పొందుతోంది. కుటుంబ సభ్యులంతా దవాఖానాలో ఉంటున్నారు. అదే కాలనీకి చెందిన రవి, సునీల్ ఇంటి తాళం పగులగొట్టి మూడున్నర తులాల వెండి, గడియారం ఎత్తుకెళ్లారు. మంగళవారం చోరీ జరిగిన విషయం తెలుసుకొన్న బాధితుడు ఎడపల్లి ఠాణాలో అనుమానితులపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు ఇద్దరు వ్యక్తులను ప్రశ్నించగా వారు నేరం అంగీకరించారు. అనంతరం ఇద్దరిని అరెస్టు చేసి ఠాణాకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ఒకరికి జైలు శిక్ష

ధర్పల్లి, న్యూస్‌టుడే: ధర్పల్లిలో ఆదివారం గంగాధర్ అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతుండగా పోలీసులు పట్టుకొని మంగళవారం జిల్లా కోర్టుకు పంపినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. జిల్లా మెజిస్ట్రేట్ అతనికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

నగరంలో..

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నాలుగో ఠాణా పరిధిలో మద్యం తాగి పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో శ్రీకాంత్ తెలిపారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు?

నవీపేట, న్యూస్‌టుడే : నవీపేట మండలం అనంతగిరిలో జరిగిన హత్య కేసులో నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. అనంతగిరి గ్రామానికి చెందిన గౌరు అమృతం (54)ను వివిధ కారణాలు, పాత కక్షలతో అతని తనయుడు మహిపాల్ టవల్‌తో ఉరేసి హత్య చేసిన సంగతి తెలిసిందే. తండ్రి అనారోగ్యంతో చనిపోయినట్లు చిత్రీకరించేందుకు కొడుకు యత్నించగా.. బంధువులు మెడపై గాట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు చేపట్టిన విచారణలో అమృతం హత్యకు గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని వివరాలు సేకరిస్తున్నారు. బుధవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఆర్మూర్
• ఆర్మూర్ • బాల్కొండ

ఖిల్లాను సందర్శించిన అధికారులు


అధికారులకు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ ఖిల్లాను పురావస్తు శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేకాధికారి ధీరజ్, నిజామాబాద్ మ్యూజియం ఇన్‌ఛార్జి రాజేందర్ మంగళవారం సందర్శించారు. ఖిల్లా, దాని భూములను పరిశీలించారు. పర్యాటక కేంద్రంగా ఖిల్లాను తీర్చిదిద్దాలని, భూములు కబ్జాకు గురికాకుండా కాపాడాలని స్థానికులు, ఖిల్లా పరిరక్షణ కమిటీ సభ్యులు కోరారు. చరణ్, కమిటీ సభ్యులు సత్యనారాయణ, బీఆర్ నర్సింగ్‌రావు తదితరులున్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి ఆహ్వానం

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ అమృతధార ఆశ్రమంలో మహా రుద్రము, కోటి మృత్యుంజయ మంత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు హరాచారి నారాయణ తెలిపారు. ఈ మేరకు వచ్చే నెల 14వ తేదీన ముగిసే మహా రుద్రము కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను మంగళవారం నిజామాబాద్‌లో కలిసి ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. వెంట నర్సాగౌడ్, గంగరత్నం, రాజు, నరేష్‌కుమార్ తదితరులున్నారు.



నలుగురు ఏఈల నియామకం

ఆర్మూర్ : విద్యుత్తు శాఖ సాధారణ బదిలీల్లో భాగంగా కొత్తగా నలుగురు ఏఈలను నియమించినట్లు మంగళవారం ఏడీఈ ఎం.అశోక్ తెలిపారు. నందిపేట్, నూత్‌పల్లి, మాక్లూర్, గొట్టుముక్కుల సెక్షన్ల బాధ్యతలను ఏఈలు తూము రవి, జి.రమేశ్, డి.మిథున్, హైమద్‌లు స్వీకరించినట్లు వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పెర్కిట్ దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) శిక్షణకు రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ సహకారంతో ప్రారంభించనున్నట్లు కేంద్రం జిల్లా అధికారిణి రాజశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థులు పది, ఇంటర్, టీసీ, బోనఫైడ్, కమ్యూనిటీ, రెసిడెన్సీ ధ్రువపత్రాలు, రెండు ఫొటోలు, రూ.200 కట్టి మీ సేవా కేంద్రంలో ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 83094 63999 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

తొర్లి(ఏర్గట్ల): ఆరోగ్య విస్తరణాధికారి మోతీరాం ఆధ్వర్యంలో మండలంలోని తొర్లి గ్రామంలో మంగళవారం 'డ్రై-డే' కార్యక్రమం నిర్వహించారు. దోమల నివారణకు పలు సూచనలు చేశారు. ఇళ్లలోని నిల్వ నీటిని తొలగించాలన్నారు. డెంగీ, ఇతర సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు రాజహంస, స్వప్న, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణ పరిశీలన

ఆర్మూర్ గ్రామీణం: పట్టణంలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం డీసీఈబీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సీతయ్య సందర్శించారు. ఈ సందర్భంగా సమ్మేటివ్ పరీక్షల నిర్వహణను ఆయన పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులున్నారు.

త్వరలో బీసీ పట్టభద్రుల పోరం ఏర్పాటు

బాల్కొండ: తెలంగాణ బీసీ పట్టభద్రుల ఫోరం త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు అబ్బగోని అశోక్‌గౌడ్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా బీసీల స్థితిగతులు మారడం లేదన్నారు. జీవో 29 రద్దు చేసి బీసీలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

అసంపూర్తి పనులు.. అవస్థల్లో ప్రయాణికులు


పనులు నిలిచిపోయిన సిద్ధాపూర్, మగ్గిడి రోడ్డు

సందిపేట్ మండలం సిద్ధాపూర్ నుంచి ఆర్మూర్ మండలం మగ్గిడి మీదుగా చిట్టాపూర్ కమాన్ వద్ద ఎన్‌హెచ్ 44కు అనుసంధానిస్తూ రోడ్డు వేయాలని వివిధ మండలాల ప్రజలు ఏళ్లుగా ప్రభుత్వానికి విన్నవిస్తూ వచ్చారు. ఎట్టకేలకు ప్రభుత్వం గతేడాది రోడ్డు మంజూరు చేయడంతో దశాబ్దాల సమస్య దూరం కానుందని అంతా భావించారు. కానీ పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రయాణ పాట్లు తప్పడం లేదు.

– న్యూస్‌టుడే, నందిపేట

• సిద్ధాపూర్, మగ్గిడి రోడ్డు నిర్మాణంలో జాప్యం

నందిపేట్, నిర్మల్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల ప్రజలు జాతీయ రహదారి సమీపంలోని గ్రామాలకు వెళ్లడానికి ఆర్మూర్ లేదా పిప్రి పత్తేపూర్ మీదుగా ప్రయాణించేవారు. ఈ మార్గాల్లో ట్రాఫిక్ సమస్యతో పాటు చుట్టూ 10 కి.మీ వరకు తిరిగి వెళ్లాల్సి వచ్చేది. ఈ సమస్యలు దూరం చేసేందుకు సిద్ధాపూర్ నుంచి మగ్గిడి మీదుగా ఎన్‌హెచ్ 44 వరకు సుమారు ఏడున్నర కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.9.47 కోట్లు మంజూరు చేసింది. టెండరు పూర్తి చేసి పనులు కూడా ప్రారంభించారు. కాని భూసేకరణ చేసి కంకర, డస్ట్ వేసి వదిలేశారు. దీంతో ఈ మార్గంలో వెళ్లే వారు కంకరపై వాహనాలు నడిపేందుకు అవస్థలు పడుతున్నారు. పనులకు నిధుల మంజూరు చేసినా ఎల్‌వోసీ ఇవ్వకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. అర కిలోమీటరు మేర సీసీ రోడ్డు కూడా న్యాయపరమైన చిక్కులుండడంతో పనుల్లో మరింత జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా తమ ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

ఇబ్బందులు తొలగించాలి..



మా ప్రాంత ప్రజలు ఆర్మూర్, బాల్కొండ మండలాల్లోని కొన్ని గ్రామాలకు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. నిత్యం ఎంతో మంది ఈ మార్గంలో ప్రయాణం చేస్తారు. నిర్మాణం త్వరగా పూర్తి చేస్తే ప్రయాణ భారం తగ్గి ఇబ్బందులు తొలగుతాయి.

– మల్లయ్య (సిద్ధాపూర్), సుంకరి బొర్రన్న (దత్తాపూర్)

త్వరలో పూర్తి చేస్తాం..

ఇప్పటివరకు కొంతమేర పనులు చేశాం. బిల్లులు మంజూరు కాకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. సాధ్యమైనంత త్వరగా నిర్మిస్తాం.

– రఘువీర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ

ఆలయంపై దాడిని ఖండిస్తూ ధర్నా

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడికి నిరసనగా ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో మంగళవారం హిందూ సమితి అంకాపూర్ ఆధ్వర్యంలో రహదారిపై ప్లకార్డులతో ధర్నా నిర్వహించారు. ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను, చేయించిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. హిందూ సమితి అధ్యక్షుడు బొర్రయ్య, న్యాయవాది జెస్సు అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఆలయాలపై వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం తీసుకుంటోందని, వాటికి రక్షణ మాత్రం ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. హిందువులు ఇలాంటి దాడులను ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


అంకాపూర్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

సంప్రదిస్తే సమస్యలు పరిష్కరిస్తాం

నందిపేట్, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులకు ఏవైనా సమస్యలుంటే తమను సంప్రదిస్తే సత్వరమే పరిష్కరిస్తామని విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్మన్ నారాయణ అన్నారు. మండలంలోని నూత్‌పల్లి విద్యుత్తు ఉపకేంద్రంలో మంగళవారం ఈ వేదికను నిర్వహించగా. . వివిధ గ్రామాలకు చెందిన నలుగురు ఫిర్యాదు చేశారు. స్పందించిన సిబ్బంది వెంటనే సమస్యలను పరిష్కరించారు. ఏళ్ల క్రితం తమకు విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలని వినతి ఇచ్చినా.. పరిష్కరించలేదని నందిపేట్‌కు చెందిన పలువురు పేర్కొనగా.. వినతిపై చర్యలు తీసుకుంటామని ఛైర్మన్ హామీ ఇచ్చారు. పంట పొలాల్లో విద్యుత్తు సమస్యలు తలెత్తితే సిబ్బందికి తెలియజేయాలన్నారు. సొంతంగా మరమ్మతులు చేస్తే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సభ్యులు రామకృష్ణ, కిషన్, డీఈ శ్రీనివాస్, ఏడీఈ అశోక్, ఏఈలు రమేష్, రవి, మిథున్ తదితరులు పాల్గొన్నారు.


ఛైర్మన్ నారాయణకు ఫిర్యాదు ఇస్తున్న నందిపేట్ వాసులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అఘాయిత్యానికి పాల్పడి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జాతీయ కమిటీ పిలుపు మేరకు సంఘీభావం తెలుపుతూ పట్టణంలోని మామిడిపల్లి ఆదర్శ నగర్‌లో మంగళవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యశివాజీ, నాయకులు మగ్దుం పటేల్, వరుణారెడ్డి, అలీమ్ భాయ్, లక్ష్మణ్, లతీఫ్, కాజా పటేల్, గంగాధర్, షమీ తదితరులు పాల్గొన్నారు.


నిరసనలో ఐఎఫ్‌టీయూ నాయకులు

పలువురికి సన్మానం

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: కమ్మర్‌పల్లి కేఎంసీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య, ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత హెచ్.బాలయ్య, డీఎస్సీ సాధించిన రాజశేఖర్, వరుణ్ కృష్ణమూర్తి, శేఖర్‌లను అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆంద్రయ్య, డిపో మేనేజర్ నల్లసాయన్న, హెచ్ఎం గంగాధర్, సుంకరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలో కొటార్మూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రేణుక ఎల్లమ్మ ఆలయ 14వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు రాజు, ఆలయ అర్చకుడు షేర్ల సాయాగౌడ్ ఆధ్వర్యంలో అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం హోమం, అన్నదానం చేపట్టారు. ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు వినయ్‌కుమార్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు ప్రసాద్, మురళీధర్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు తీగల నరేందర్‌గౌడ్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

కుమురం భీం జయంతి

ఆర్మూర్ గ్రామీణం, ముప్కాల్(బాల్కొండ), న్యూస్‌టుడే: ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఆదివాసీ నాయక పోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కుమురం భీం జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు మేడిపల్లి గరీష్, రాటం భూమన్న, సభ్యులు పాల్గొన్నారు. ముప్కాల్‌లో ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో జయంతిని జరిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కంచు శ్రావణ్‌కుమార్, సతీష్, కంచు విజయ్ తదితరులు పాల్గొన్నారు.


చేపూర్‌లో నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

అంబేడ్కర్ జీవిత చరిత్రపై నాటక కళా ప్రదర్శన నేడు

భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: భీమ్‌గల్ మండల కేంద్రంలోని ఎల్‌జే ఫంక్షన్ హాలులో మాలల సంక్షేమ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ జీవిత చరిత్రపై నాటక కళా ప్రదర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల మాలల సంక్షేమ ఐక్యవేదిక కార్యనిర్వాహకులు పర్స విఘ్నేష్, బట్టు అనిల్, మేకల శ్రీనివాస్ తెలిపారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారిచే 'సంఘం శరణం గచ్ఛామి' 678వ నాటక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు.. మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పోచంపాడ్(బాల్కొండ), కమ్మర్‌పల్లి, నందిపేట్, ముప్కాల్(బాల్కొండ), న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మెండోరా మండలం పోచంపాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం ఆందోళన చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఒకటో తేదీన వేతనాలు జమ అవుతున్నాయని.. దానిని మాత్రమే ప్రభుత్వం గొప్పగా చెప్పుకొంటోందని అన్నారు. డీఏలు ఇవ్వాలని, పీఆర్‌సీ అమలు చేయాలని కోరారు. ఈనెల 28న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట, వచ్చే నెల ఐదో తేదీనా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద, 23వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోచంపాడ్‌లో నిర్వహించిన ఆందోళనలో మండల అధ్యక్షురాలు వడ్నాల జ్యోతి, పోచంపాడ్ జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు శుభ, ఉమ, తిరుమల, సుధ తదితరులు పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాలలో మండలాధ్యక్షుడు సల్లూరి కిషన్, కార్యదర్శి రమేశ్, డివిజన్ కార్యదర్శులు పాల్గొన్నారు. డొంకేశ్వర్ పాఠశాలలో నిరసన తెలిపారు. ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరపత్రాలు ప్రదర్శించారు. సంఘం మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి కనకాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


డొంకేశ్వర్‌లో..







పోచంపాడ్ జడ్పీహెచ్‌ఎస్ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు : కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాలలో.. : ముప్కాల్‌లో..

నేలకొరిగిన వరి


మోర్తాడ్ మండలం దోన్‌పాల్‌లో మంగళవారం కురిసిన వర్షానికి పలు చోట్ల వరి పంట నేల కొరిగింది. వర్షంతో చేతికొచ్చిన పంట దెబ్బతింటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, దోన్‌పాల్(మోర్తాడ్)



ప్రతి గింజ ప్రభుత్వమే తీసుకుంటుంది

భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సయ్య అన్నారు. భీమ్‌గల్ మండలం బాబాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బొదిరె స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిన్నారెడ్డి గోపాల్ నాయక్, జేజే నర్సయ్య, కుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ తదితరులు

జాగ్రత్తలు పాటించాలి

ఏర్గట్ల, న్యూస్‌టుడే: వరి కోతల సందర్భంగా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ విస్తరణాధికారి సాయిసచిన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరి కోత యంత్రంలో బ్లోయర్ ఫ్యాన్ నడిచే విధంగా చూసుకోవాలన్నారు. దీంతో తాలు, ఇతర వ్యర్థాలు రాకుండా ఉంటాయన్నారు. ఇప్పటికే కోతలు కోసిన రైతులు ధాన్యం తడవకుండా చూసుకోవాలన్నారు. వర్ష సూచన ఉన్నందున కోతలు ఆలస్యం చేయాలని సూచించారు. తేమ శాతం 12కు మించకుండా సోయాలను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి రూ.4892 మద్దతు ధర పొందాలని పేర్కొన్నారు.

క్రీడా దుస్తుల అందజేత



భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన శ్రీధర్ గౌడ్ మంగళవారం క్రీడా దుస్తులు అందజేశారు. ఆయనను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణ స్వామి, పీడీ భూపతి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

వాహనాల తనిఖీ

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ బైపాస్ వద్ద ఏఎస్సై శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దు

మాక్లూర్, న్యూస్‌టుడే: వేణుకిసాన్‌నగర్ సమీపంలోని ప్రధాన రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పలను మంగళవారం ఎస్సై రాజశేఖర్ పరిశీలించారు. అనంతరం అక్కడున్న రైతులతో మాట్లాడారు. రోడ్లపై ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం ఆరబెట్టొద్దని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో ధాన్యం కుప్పలతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు. వాహన చోదకులు ప్రమాదాలకు గురైతే కేసు నమోదు చేయాల్సి వస్తుందని తెలిపారు.


రైతులతో మాట్లాడుతున్న ఎస్సై రాజశేఖర్

వర్షాల జోరు.. రైతులు బేజారు

– న్యూస్‌టుడే, వేల్పూర్

గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం వరి రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా పంట కోతకు రాగా.. టైరు యంత్రంతో నూర్పిడి చేయిస్తే గంటకు సుమారు రూ.1750 తీసుకుంటుండగా.. చైన్ యంత్రానికి రూ. 2800 తీసుకుంటున్నారు. వర్షంతో టైరు యంత్రాలు పొలంలోకి దిగే అవకాశం లేకుండా పోవడంతో తప్పని పరిస్థితుల్లో చైన్ యంత్రాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. చైన్ యంత్రంతో ఎకరం వరి నూర్పిడి చేయాలంటే రెండు గంటల సమయం పడుతోందని, దాదాపు గంటకు రూ.1050 అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

పంట ఆరబెట్టడానికి ఇబ్బందులు..

వర్షాలకు నేల తడిగా ఉంటోంది. కింద పాలిథిన్ కవర్లు వేసిన మధ్యాహ్న సమయంలో వర్షం రావడంతో నాలుగు రోజులైనా తేమ శాతం రావడం లేదు. దీంతో పాలిథిన్ కవర్ల అద్దె వ్యయం రైతులకు భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోలు త్వరగా ప్రారంభిస్తే తమకు మేలు జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు.


వేల్పూర్‌లో చైన్ యంత్రంతో ధాన్యం నూర్పిడి చేయిస్తున్నారిలా..

ఉపాధి కోసం వచ్చి మృత్యుఒడికి..

☛ రోడ్డు ప్రమాదంలో ఖమ్మం వాసి దుర్మరణం

గాండ్లపేట్(మోర్తాడ్), న్యూస్‌టుడే: ఉపాధి కోసం వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన మోర్తాడ్ మండలం గాండ్లపేట్ వద్ద 63వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా తల్లడ మండలం కలకొడవకు చెందిన కాకర్ల గోవింద్, ఆయన భార్య లక్ష్మి ఉపాధి నిమిత్తం సోమవారం మోర్తాడ్‌కు వచ్చి స్థానికంగా ఓ ఇంట్లో అద్దెకు దిగారు. రాత్రి బయటకు వెళ్లిన గోవింద్ అద్దెకు తీసుకున్న ఇంటిని మర్చిపోయి 63వ జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

రైలు పట్టాలపై మృతదేహం లభ్యం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ రైల్వే బ్రిడ్జి వద్ద పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం మంగళవారం లభ్యమైంది. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. మృతుడికి సుమారు 50 ఏళ్ల వయసు ఉంటుందని రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కల్లు డిపోలో నగదు చోరీ

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ షఫీల్ కట్ట ప్రాంతంలోని కల్లు డిపోలో సోమవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. డిపో కార్యాలయం తాళం ధ్వంసం చేసి లోనికి ప్రవేశించి బీరువాలోని రూ.47 వేలు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు డిపో వారు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఘటనా స్థలాన్ని ఏఎస్సై శంకర్ సందర్శించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.